క్లుప్తంగా

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు



మరికల్: మండల కేంద్రంలోని శ్రీవాణి పాఠశాల ఆవరణలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మంగళవారం చిన్నారి విద్యార్థులకు యోగా చేయడంతో కలిగే ఆరోగ్య ఫలితాలపై నిర్వాహకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లశర్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగా చేస్తే భవిష్యత్‌లో మంచి ఆరోగ్యం పొందొచ్చని సూచించారు. ఈ వేసవి యోగా తరగతులను పాఠశాలలు పునః ప్రారంభం వరకు నిర్వహిస్తామన్నారు.

భూసార పరీక్షలు నిర్వహించాలి

మరికల్: వానాకాలంలో పంటలు సాగుచేసే ముందు వ్యవసాయశాఖ అధికారులు మట్టి పరీక్షలు నిర్వహించాలని రైతు సంఘం నాయకులు పద్మనాభంరెడ్డి, రాములు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ భూ పరీక్షలు నిర్వహిస్తేనే భూమిలో ఏ పంట సాగుచేయాలనే విషయం తెలుస్తుందన్నారు. ప్రతి రైతుకు చెందిన భూములను అధికారులు పరీక్షలు చేసి ఏ పంటలు సాగు చేయాలో రైతులకు సూచించాలని తెలిపారు. లేకుంటే వేసిన పంటలు పండకా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ అమానుషం

నారాయణపేట రూరల్: ఎన్నికల విధులకు హాజరైన ఉపాధ్యాయులు రెమ్యూనరేషన్ తక్కువగా చెల్లిస్తున్నారని ప్రశ్నిస్తే వారిపై లాఠీచార్జి చేయడం సరికాదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డిలు ఒక ప్రకటనలో ఖండించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగిన సంఘటనకు బాధ్యులైన పోలీసులు, ఆ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం చెల్లించకపోగా, రాతపూర్వకంగా ప్రాతినిధ్యం చేసిన పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు తట్టుకుని విజయవంతంగా ఎన్నికలను పూర్తిచేసిన ఉద్యోగులపై అమానుషంగా ప్రవర్తించడం సరికాదన్నారు.

ఆత్మకూర్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆత్మకూర్ మండల అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధానకార్యదర్శి ఆదం, ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, కోశాధికారి రాజు మండిపడ్డారు. నారాయణఖేడ్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం రెమ్యూనేషన్ చెల్లించాలని కోరడంతో ఆర్డీఓ పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం దారుణమన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

వైభవంగా కర్రెమవ్వ బోనాలు



మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లిలో వెలసిన కర్రెమవ్వ తల్లిబోనాల మహోత్సవం మంగళవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉదయం నుంచి ఇళ్లను శుభ్రం చేసుకుని బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనాలు, పోటేళ్లను, కోళ్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో బోనాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిమ్మప్ప, మాజీ ఉపసర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ బంగి క్ష్మి, అంజప్పగౌడ, తిమ్మప్ప, సంజీవ్, నర్సింహులు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని ఫాగింగ్ యంత్రం

అమరచింత: పట్టణంలో దోమల బెడదను నివారించడానికి కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రం మరుగునపడింది. చిన్నపాటి మరమ్మతు సైతం చేపట్టలేకపోవడంతో ఫాగింగ్ యంత్రాన్ని మున్సిపల్ కార్యాలయంలోని మూలనపడేశారు. పట్టణంలోని పది వార్డుల్లో మురుగు కాల్వలు శుభ్రపర్చని కారణంగా దోమల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా వార్డుల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూ.రెండు లక్షలతో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రానికి వెంటనే మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



సంత.. సమస్యల చింత

- సదుపాయాలు లేని సంత
- రోడ్డు పైనే విక్రయాలు
- ప్రతి మంగళవారం పాట్లు
- ఇబ్బందులు పడుతున్న చిరువ్యాపారులు



వేసవి ఎండలో సంత

దామరగిద్ద: ఏళ్లుగా తైబజార్ నిర్వహణకు ప్రత్యేక సదుపాయం లేక చిరువ్యాపారులు ఎండైనా.. వానైనా గొడుగు నీడలో కూర్చొని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్న దుస్థితి. మండల కేంద్రంలోని ప్రతి మంగళవారం నిర్వహించే తైబజార్‌లో వ్యాపారులు ఏకాలంలోనైనా గొడుగు పట్టాల్సిందే. పాలకులు ప్రభుత్వాలు మారుతున్న మార్కెట్ సదుపాయాల కల్పనలో పెద్దగా మార్పు రాలేదు. మార్కెట్‌సదుపాయం లేక చిరువ్యాపారులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఇరుకు రోడ్డు ఉండగా రోడ్డు విస్తరణతో ప్రధాన రహదారిలో రాకపోకలకు సౌకర్యం కల్గింది. ప్రస్తుతం ఎస్‌బీఐ బ్యాంక్ ముందు రోడ్డు నుంచి నగరేశ్వర ఆలయం వరకు ఇరుకైనా మట్టిరోడ్డుపై రోడ్డుకు ఇరువైపుల సంతబజార్ నిర్వహిస్తున్నారు. దీంతో ఎలాంటి షెడ్లు లేకపోవడంతో వేసవి కాలం ఎండలకు.. వానకాలంలో వర్షం నుంచి రక్షించుకనేందుకు గొడుగు నీడే ఆధారంగా మారింది. ఇరుకు రోడ్డుపై ఇరువైపుల వ్యాపారులు కూర్చోవడంతో కొనుగోలు దారులు సైతం ఇరుకు స్థలంలో ఇబ్బందులు పడుతు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి వ్యాపారి రూ. 30 రుసుము చెల్లిస్తున్నారు. ఏటా గ్రామ పంచాయతీకి లక్షల రూపాయలు వేలం పాట ద్వారా ఆదాయం సమకూరుతున్న సరైన మార్కెట్ స్థలాన్ని గుర్తించి సదుపాయం కల్పించకపోవడంతో వ్యాపారులు, అటు కొనుగోలుదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎలాంటి సదుపాయం లేదు..



ప్రతి మంగళవారం కూరగాయలు అమ్మేందుకు మద్దూర్ నుంచి ప్రతి వారం వస్తాను. సంతలో రోడ్డుపై కూర్చొని అమ్ముకుంటున్నా. ఎలాంటి సదుపాయం లేదు. మండుటెండల్లో ఎండలకు తట్టుకో లేక గొడుగుల కింద కూర్చొని కూరగాయాలు అమ్ముకుంటున్నాం. మార్కెట్లో కూరగాయలు అమ్ముకున్నందుకు 30రూపాయలు మార్కెట్ ఫీజు కట్టించుకుంటారు. మార్కెట్ సదుపాయం కల్పించి మాలాంటి వ్యాపారులను సౌకర్యం కల్పించాలి.

- అంజమ్మ, కూరగాయాల వ్యాపారి

ఆదుకోవాలి ..



ఉపాధికోసం రోజుకో ఊళ్లో జరిగే సంతలో వ్యాపారం చేసుకోనే మా లాంటి వ్యాపారులను గుర్తించి ఆదుకోవాలి. ఏ గ్రామానికి వెళ్లిన మార్కెట్ సదుపాయం లేదు. ఇరుకు రోడ్లపై మండుటెండల్లోనే వ్యాపారం చేసు కుంటున్నాం. అధికారులు మార్కెట్ నిర్మా ణం చేపట్టి సదుపాయం కల్పించాలి.

- వెంకటేష్, కూరగాయాల వ్యాపారి

స్థల పరిశీలన చేస్తున్నాం..



మార్కెట్ సదుపాయం విషయమై గతంలో కలెక్టర్ ఆదేశాలతో అప్పటి తహసీల్దార్ స్థల పరిశీలన చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో గ్రామ ప్రజా ప్రతినిధులతో చర్చించలేదు. కోడ్ అనంతరం రెవెన్యూ అధికారుల పరిశీలన ఆధారంగా గ్రామ పరిధిలో అనువైన స్థలాన్ని గుర్తించి అధికారులకు నివేదిస్తాం.

- శ్రీధర్, ఎంపీడీఓ దామరగిద్ద

బీజేపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ: బీజేపీ అభ్యర్థి డీకే. అరుణ గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో 400 సీట్లు సాధించి ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానుందని ఆయన జోష్యం చెప్పారు. మక్తల్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు మోదీ అంటు కమలం గుర్తుకు ఓటు వేసినట్లు చెబుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో బీజేపీ కార్యకర్తలతోపాటు యువత నడుంబిగించి గెలుపుకోసం శ్రమించారని వారందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు పోరాటం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ సర్పంచ్ జగన్నాథం, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వావిళ్ల రవికుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట: పాలమూరు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించడం ఖాయమని జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తంచేశారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ అమలుచేసిన సంక్షేమ పథకాలే ఎన్నికల్లో బీజేపీని గెలిపించబోతున్నాయని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భూనీడ్‌లో పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

మద్దూరు: మండలంలోని భూనీడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారికి బోధించిన ఉపాధ్యాయులకు సన్మానించారు. ఈ మేరకు.. పూర్వ విద్యార్థుల యోగక్షేమాలను ఉపాధ్యాయులు అడిగి తెలుసుకున్నారు. ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు మనవంతు సహాయం అందించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిరుపతిరెడ్డి, బాబునాయక్, రఫీ, రాంరెడ్డి, ధశరత్, ఆశప్ప, లక్ష్మి, సంధ్య, అనిత, హారతి, రామాదేవి తదితరులు పాల్గొన్నారు.

భగీరథుడి స్ఫూర్తితో ముందుకు సాగాలి



ధన్వాడ మండలం కంసాన్‌పల్లిలో..



తళంకేరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

మాగనూర్: భగీరథ మహర్షి ఈ లోకానికి అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలని నాయకులు శ్యామ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తళంకేరి గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామస్తులు భగీరథ మహర్షి జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. భగీరథుడు చూపించిన బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లిలో సగర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహర్షి భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి పూజలు చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, శివరాజు, విజయకుమార్, శంకరయ్య, వెంకటయ్య, నారాయణ, రాములు, పరందాములు, రాజు, సా గర్, పెద్ద వెంకటయ్య, వెంకటయ్య, సాంబశివుడు, భాస్కర్, రాములు, నాగయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

నారాయణపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఓటువేసేందుకు తరలివచ్చిన ప్రతి ఒక్క ఓటరుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రఘు రామయ్యగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కే.రతంగ పాండురెడ్డి తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకుని సరియైన సమయానికి చేరుకుని బాధ్యతగా ఓటు వేయడం అభినందనీయమన్నారు. పార్లమెంట్‌లో మన వాణి వినిపించేందుకు డీకే అరుణ పక్షాన నిలిచి కమలం గుర్తుకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో బీజేపీకి పెద్ద ఎత్తున మెజార్టీ వస్తుందని, డీకే అరుణ గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెడుతుందని జ్యోష్యం చెప్పారు. మోదీ సభ విజయవంతానికి కృషిచేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌దే గెలుపు

నారాయణపేట: మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకే మెజారిటీ ఓట్లువేశారని ఎంపీ అభ్యర్థి చల్లా. వంశీచంద్‌రెడ్డి గెలుపొందడం ఖాయమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం మంగళవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో సీఎం రేవంత్ అమలు చేసిన పలుసంక్షేమ పథకాలు, పేట కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు మంజూరు చేయడంతో పాటు ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం పర్ణికారెడ్డి, కుంభం శివకుమార్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందనే నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్‌ను మరోసారి గెలిపించబోతున్నారని ఆశాభావం వ్యకం చేశారు. ఓటర్లకు కాంగ్రెస్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డుపై కమ్మేసిన కంపచెట్లు



నేరడగం సమీపంలో రోడ్డుపై కమ్మేసిన కంపచెట్లు

మాగనూర్: మండలంలోని వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి గ్రామాలకు వెళ్లేరోడ్డు కంపచెట్లతో కమ్మేసి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఈ రోడ్డు వెంట ప్రయాణించే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరిగిపోయి రోడ్డును పూర్తిగా కమ్మేశాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు అతి సమీపంలోకి వచ్చే వరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్కూర్ నుంచి ఉజ్జెల్లి వరకు కంపచెట్లు కమ్మేయడంతో రోడ్డు మలుపు వద్ద వాహనదారులు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపుల పెరిగిన కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆంజనేయస్వామి జాతర కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: మండలంలోని ఎల్‌బీనగర్ పడమటి ఆంజనేయస్వామి జాతర ఉత్సవాల కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 22న స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం, అన్నదాన కార్యక్రమం, ఈ నెల 23న గ్రామ పురవీధుల గుండా కలశ ఊరేగింపు, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, వెంకటప్ప, నాగేష్, వెంకటేష్‌గౌడ్, చిన్నహన్మంతు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే



అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో గల రైతువేదిక వద్ద ఉన్న బోరుమోటార్ ప్రమాదాలకు నెలవుగా మారింది. రైతు వేదిక నిర్మాణ సమయంలో తవ్వించిన బోరుబావి ప్రస్తుతం పైకప్పు లేకుండా ఉండటంతో చిన్న పిల్లలు ఆడుకుంటూ అందులో పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోరు తెరుచుకున్న బోరుబావికి మోటార్ బిగించాలని లేదా వాటిని మూసి ఉంచాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

గెలుపోటములపై చర్చోపచర్చలు



కోయిల్‌కొండలో ఎన్నికలపై చర్చిస్తున్న నాయకులు

కోయిల్‌కొండ: మండలంలో పార్లమెంటు అభ్యర్థుల గెలుపు ఓటముల అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఏ నలుగురు కలిసినా రాజకీయ చర్చే కొనసాగుతోంది. గతంలోకి భిన్నంగా ఈసారి ప్రజాతీర్పు ఉంటుందని, ప్రజలు మార్పుకోరుకుంటున్నారని ప్రచారం సాగింది. కాగా ఎవరికి వారే తమ పార్టీ గెలుస్తుందంటే తమ పార్టీ గెలుస్తుందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ముఖ్యంగా ఈసారి కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొందని పలువురు భావిస్తున్నారు. సీఎం రేవంత్ వర్సెస్, ప్రధాని మోదీ అన్నట్లుగా పోలింగ్ సాగిందని అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయంపై మంగళవారం వివిధ పార్టీల నాయకులు ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఇదిలా ఉండగా మండలంలో పోలింగ్ శాతం పెంచేందుకోసం అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా అంతగా ఫలితాలు ఇవ్వాలేదు. పైగా తగ్గిపోయింది. మొత్తంగా మండలంలో 69.8 శాతంగా పోలింగ్ నమోదైందని లెక్కలు చెబుతున్నాయి.

ఎవరి లెక్కలు వారివే..

నవాబుపేట: మండలపరిధిలో పోలింగ్ సరళి భాగానే కనిపించినా ఓట్లు మాత్రం ఎవరికీ ఎక్కువగా పడ్డాయోననేది మాత్రం సస్పెన్స్‌గా మారింది. 'మీ ఊరిలో గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా మనకు లీడ్ వస్తుందంటావా' అంటూ నాయకులు ఆరా తీస్తున్నారు. కాగా క్యాడర్ లేని ఓ పార్టీకి ఓ గ్రామంలో మెజార్టీ వస్తుందని ఓటర్ నాడీ చెప్పడంతో వివిధ పార్టీల నాయకులంతా అవాక్కై తమ పార్టీల నేతలతో పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు వేస్తూ అంచనాలను సిద్ధం చేస్తున్నారు. ఇన్ని రోజులు ఆయా గ్రామాల్లో తమకు పట్టు ఉందని చెప్పుకున్న నాయకులు.. పోలింగ్ సరళితో వారి అంచనాలు తలకిందులు అయ్యాయన్న ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా నాయకుల అంచనాలు తేటతెల్లం కావాలంటే జూన్ 4 వరకు చూడాల్సిందే.

జోరుగా ఇసుక దందా

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు వర్కూర్‌వాగు నుంచి మక్తల్ మండలం దాసర్‌పల్లి గ్రామానికి చెందిన కొందరు నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. మాగనూర్ మండల పెద్దవాగు పరివాహక గ్రామాల్లో దందా కొనసాగుతున్న.. స్థానిక అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి మండలంలోని ఆయా గ్రామాల్లో సాగుతున్న ఇసుక అక్రమ దందాపై ఉక్కుపాదం మోపాలని సమీప పొలాల రైతులు కోరుతున్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్



కొత్తకోట రూరల్: పట్టణంలో వాహనాల పార్కింగ్ విచ్చలవిడిగా మారింది. రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, తుఫాన్ వాహనాలు, ఆటోలు ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అక్రమ పార్కింగ్ నిరోధించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్టుగా మిన్నకుండిపోతున్నారు. దీంతో పట్టణంలో ఉన్న నాలుగు రోడ్లు పూర్తిగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. అంతే కాకుండా ప్రధాన రోడ్లకు వైన్ షాపులను ఏర్పాటు చేయడంతో మందు బాబులు తమ బైక్‌లను రోడ్డుకు పక్కనే నిలిపి వైన్ షాపుల్లోకి వెళ్లడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాలకులు మదనాపురం రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో ఆత్మకూర్ వైపువెళ్లే వాహనదారుల ఇబ్బందులు వర్ణణాతీతం.

కొనసాగుతున్న ఆర్‌యూబీల నిర్మాణం



డిగ్రీ కళాశాలవైపు పూర్తయిన ఆర్‌యూబీ



సర్వీస్‌రోడ్డు మెయింటెనెన్స్ వాల్



హైస్కూల్‌వైపు నిర్మాణంలో ఉన్న ఆర్‌యూబీ



హైస్కూల్ వైపు సర్వీస్‌రోడ్డుకు మెయింటెనెన్స్ వాల్

జడ్చర్ల టౌన్: రాయచూర్ నుంచి కోదాడ వరకు ఉన్న 167వ నంబరు జాతీయరహదారిపై మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డపై విస్తరణ పనుల్లో భాగంగా ఆర్‌యూబీల నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ప్రస్తుత రైల్వేబ్రిడ్జికు ఇరువైపులా రెండు ఆర్‌యూబీలు నిర్మాణం చేస్తున్నారు. వీటికి అనుబంధంగా సర్వీస్‌రోడ్లు సైతం చేపట్టారు. ఇప్పటికే డిగ్రీ కళాశాల వైపు ఒక ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయ్యింది. దీనికి అనుబంధంగా సర్వీస్‌రోడ్డు మెయింటెనెన్స్ వాల్ సైతం పూర్తిచేస్తున్నారు. ఆర్‌యూబీ ద్వారా డిగ్రీకళాశాల విద్యార్థులు, ఆయా కాలనీవాసులు జాతీయరహదారి దాటేందుకు సులువవుతుంది. అలాగే హైస్కూల్ వైపు ఆర్‌యూబీ నిర్మాణం పనులు ఊపందుకున్నాయి. ఇక్కడ సర్వీస్‌రోడ్డుకు సంబంధించిన మెయింటెనెన్స్ వాల్ పనులు కొనసాగుతున్నాయి. ఈ సర్వీస్‌రోడ్డు గుండా హైస్కూల్ విద్యార్థులతోపాటు శ్రీనివాస్‌నగర్ కాలనీవాసులు సులువుగా జాతీయరహదారి దాటి అవతలివైపు ప్రయాణించే అవకాశం కలుగుతుంది.